
# అత్తగారూ- పనివాళ్లూ

భానుమతీ రామకృష్ణ



అత్తగారు భోంచేసి విసనకర్రతో హాల్లో వున్న చాపమీద నడుం వాల్చడానికి లోపల్నుంచి వస్తారు "కృష్ణా" అంటూ భుక్తాయాసంతో—

వీధిలో ఎవరో సిల్వర్ సామాన్లవాడి కేక వినిపిస్తుంది.

**అత్తగారు :-** "ఒరేయ్ గుండుమణీ, ఆ ఎవరో సిల్వర్ పాత్రలవాడిని కేకెయ్యరా ..."

అని పనివాడితో చెప్తుంది.

**గుండు :-** "సరేనండమ్మగారు"

అంటూ మణి వెళ్తాడు వీధిలోకి. పాత్రలవాడు ఓ వైపునుంచి ప్రవేశిస్తాడు.

**అత్త :-** "అమ్మాయ్ ! ఆ మూట తీసుకురావే బీరువా తెరిచి," అంటూ కోడలికి చెప్తుంది.

ఎవరో సిల్వర్‌వాడు బుట్ట దించగానే

యిది చారుకి బాగుందే! యిది పప్పుకీ అది పాయసానికి బావున్నాయి. యీ మూతలు రెండూ, గరిటెలు రెండూ కూడా తీసుకోవచ్చు. ఆ చెంబు గూడా మడి నీళ్ళు పెట్టుకోడానికి బాగానేవుంది—

"ఆఁ ! యివిరా అబ్బీ గుడ్డలు,"

అంటూ గోరంత సరిగాకూడా లేని తన మడిచీర ఒకటి, చిరిగిన జాకెట్లు రెండు మూడు వాడిముందు పడేస్తుంది అత్తగారు—

**పా.వా :** "మీకూ, యీ పాతచీరకో నమస్కారం –"

అంటూ బుట్ట సర్దబోతాడు.

**అత్త :** "ఆగు ! నువ్వే మిస్తావో తేల్చి చెప్పకుండా పాత్ర లివ్వను......"

పాత్రల వాడికి ఒళ్ళు మండి, వాడు బుట్టంతా వెతికి ఒక చిన్న స్పూన్‌తీసి—

"మీ రిచ్చిన చీరలకి యిదీ వచ్చేది. తీసుకోండి—"

అని ఆ స్పూన్‌ని అత్తగారిముందు విసిరేశాడు – అత్తగారికి ఒళ్ళు తెలీని కోపం వచ్చి

**అత్త :** "ఎంత పొగర్రా నీకు ? ఫో వెధవా ! నువ్వు కాకపోతే నీ తలదన్నినవా డింకొకడొస్తాడు ! కావ్వెక్కిన గాడిద, నిక్షేపంలాంటి గుడ్డలకి ఒక్క స్పూనిస్తావట్రా ! ఆ బోడి స్పూన్ నువ్వే వుంచుకోరా ! నా కక్కర్లా !"

అని వాడి పాత్రలు సొట్టలు పడేట్లు వాడి ముందుకు నెట్టిపారేస్తూంది—

పా.వా : "ఓ ! పెద్దమ్మగారోయ్ ! ఆ పాతచీర మీ రూర కిచ్చినా నాకొద్దు గానీ పాత్తర్లు కాస్త మెల్లిగెయ్యండి- గోరంత జరీ లేదు. పట్టంట పట్టు. యీసారి మళ్ళీ యీ పక్కకొస్తే ఒట్టు. సొట్టలు పడితే మా యజమా నూరుకోడు... మళ్ళీ యీ చీరే... వేస్తారని తెలిస్తే అసలు వచ్చేవాణ్ణే కాదు - యిప్పటి కిది పదోసారి. నే రావడం మీరు ఆ చీరెయ్యడం -"

కోడలు : "పోనీ ఆ గుడ్డలకి ఏమీ రాకపోతే నా పాత జరీ పట్టుచీరలు ఒకటి రెండున్నాయి. అవి వేసి మనకు కావాల్సిన పాత్రలు తీసుకొందాం !"

అత్త : "హవ్వ ! బంగారం ముద్దల్లాంటి జల్తారు చీరలు యీ ముష్టి పాత్రలకోసం యిస్తానంటావా ! చాల్లే ! ఎవరన్నా వింటే నవ్విపోతారు - కరిగించి ఏ చెంబో, గ్లాసో చేయిస్తాను -"

అని ఆ పాతగుడ్డల మూటను కోడలి చేతికిచ్చి-

అత్త : "పట్టుకెళ్ళి బీరువాలో పెట్టి రావే !"

అని కోడలికి పురమాయిస్తుంది.

కోడలు నవ్వుకుంటూ-

కోడ : "యీ మూట తీసుకెళ్ళడం యిది పదోసారి" ...

అనుకుంటూ లోపలి కెళ్తుంది. మరోవైపు మంచి గుండుమణి కోపంగా విసురుగా కుడివైపు వెనకనుంచి ప్రవేశిస్తాడు-

పని : "ఓ ! పెద్దమ్మగారూ ! నాకో రెండు రూపాయలు వుంటే పడెయ్యండి, హోటల్ కెళ్ళి అన్నం తినేసొస్తా - వెధవ తిండి తిన్లేక చస్తున్నా..."

తిచా : "చూశారా ! చూశారా ! వెధవ తిండట ! అన్నం పరబ్రహ్మ స్వరూపం అన్నారు. తినే కంచాన్ని నేలకేసి కొట్టొచ్చా ! ఎంతపచారం ! ఎంతప చారం !"

ప.వా : "చాల్లేవయ్యా పెద్దమనిషీ ! మాడిపోయిన పప్పు నా మొహాన కొట్టి తినమంటే ఎట్ట తినేది ? పైగా ఆ మాడువాసన రాకుండా వుంటానికి ఏదో సెంటు పోసాడమ్మా ! బాబోయ్ ! డోకొచ్చిందనుకోండి ! ఆ సెంటు వాసనకి. వంటి కేసుకునే సెంటు వంటకాల్లో ఏసుకుంటారా ఎక్కడన్నా !"

తి చా : "హరి ! హరీ ! అది సెంటు గాదు ! పన్నీరు! పన్నీరు బోసాను లక్షణంగా -"

ప.వా : "ఆఁ ! లక్షణంగానే వుందా కంపు -"

తి.చా : "అంతే ! అంతే ! నీకది కంపుగానే వుంటుంది ! వూరికే అన్నారా ! 'పంది బురద మెచ్చు, పన్నీరు మెచ్చునా' అని -"

ప.వా : "యిదుగో ! వంటాయనా ! మాటలు జాగ్రత్తగా రానీ !"

అత్త : "ఏమిట్రా ! మహా నీలుగుతున్నావ్ ! ఏమిటి నీ అగడం ! ఆఁ ! మేం పెట్టేదది. తింటే తిను, లేకపోతే పో !"

ప.వా : "పోతానండి ! యీ తిండి ఎవరు తింటారు ? కుక్కలు గూడ తినవ్ !"

అత్త : "ఆఁ ! ఆఁ ! ఎంత పొగర్రా ! కుక్కలు గూడ తినవా ? అయితే మేమంతా ఎవరనుకున్నావ్ !"

ప.వా : "మిమ్మల్ని నేనన్లేదమ్మగారూ ! సెంటు పప్పు చేసాడే, యీ వంటాయన్ని -"

అత్త : "ఏంరా ! సెంటు పప్పు కేమయిందిరా ! లక్షణంగా ఘుమ ఘుమ లాడుతూంటే !"

కోడలు నవ్వాపుకుంటుంది !

ప.వా : "ఆ గమె గమే మరి ! సెంటు పప్పు గదూ !"

అత్త : శెంటు పప్పో ! శెనగ పప్పో ! నీకు దొరికే దది... తింటే తిను, లేకపోతే......"

ప.వా : "వద్దమ్మగారూ ! నా జీతం యిప్పించెయ్యండి, నే పోతా !"

పనివాడు వెళ్ళిపోతాననగానే కోడలు

"వద్దురా, డబ్బులు నేనిస్తా వుండు," అని సైగ చేస్తుంది-

కోడ : "అయినా మాడిన పప్పులో పన్నీరు పోయడం ఏమి టత్తా ! నే నెక్కడా వినలేదు - "

అత్త : "అయ్యో ! ఆ మాడువాసన రాకుండా వుంటానికేనే. నేనే చెప్పానే వాడికి. లేకపోతే ఆ వెర్రివెధవకి అన్ని తెలివితేటలు ఎక్కడొచ్చాయి.

కోడలు అడుగుతుంది.

"మీరు చెప్పారా !"

అత్త : "పప్పు మాడినప్పుడంతా పన్నీరు పొయ్యరా ! అని నా చిన్నప్పుడు వీడి అబ్బేగా మా యింట్లో వంట చేసేవాడు ! అప్పటి కింకా యీ వెధవ పుట్టలా !"

టెలిఫోను వస్తుంది—కోడలు వెళ్ళి ఫోను రిసీవ్ చేస్తుంది.

కోడ : ఏం నాన్నా! నీ ఫ్రెండ్స్‌తో భోజనానికి వస్తున్నావా? రాత్రికి ! ఏంటీ ! బాదంకీరు కావాలా ! అలాగే నాన్నా, చేయమని చెప్తాను -

అత్త : "ఏమిటీ ? ఎవరూ ?"

కోడ : "మీ మనవడు ఫోనుచేసాడు. భోజనానికి వస్తున్నాట్ట ఫ్రెండ్స్‌తో. బాదంకీరు కావాల్ట -"

అత్త : "నా దేవుడు బాదంకీరు కావాలన్నాడా! నా నాయనే! నా నాయనే! ఒరేయ్! తిరుమలం, నా మనుమడికి బాదంకీరు చెయ్యి –

(ఇద్దరూ కుడివైపు నుంచి వెళ్ళిపోతారు.)

తి.చా : "చిత్తం! చిత్తం! అంతకంటేనా!"

బాదంకీరు చేయడం తెలీని తిరుమలాచారి ఖంగారుపడుతూ గుండు మణిని పిలుస్తాడు.

తి. చా : ఒరే మణీ!

గుండు : "నాతో నీకేంటి పని?"

తి.చా : "అరే! అబ్బీ! ఆ బాదముకీరు చేయడం నాచేత గాదు. నీకేమైనా వచ్చా! అది ఎలా చెయ్యాలో తెలిస్తే చెప్పరా?"

గుండుమణికి నవ్వువచ్చి ఆపుకొని, తిరుమలాచారికి తగిన శాస్తి చేయాలని తీర్మానించి, ఆహా ఇప్పుడు కావాల్సి వచ్చానా అనుకొని–

గుండు : "అది చెయ్యడం కష్టం కాదు – రెండు ఉల్లిగడ్డలు రెండు వెల్లుల్లి గడ్డలు తరిగి పెట్టుకో–బాదంపప్పూ, శెనగపప్పూ, పచ్చిమిరపకాయలు, అల్లం, మెంతులు, చెక్క, లవంగం, కాస్త యింగువ చేర్చి, మెత్తగా, రుబ్బు. ఒక శేరు పాలలో గిన్నెలో పెరుగు కలిపి, పొయ్యిమీద బాగా మరగనిచ్చి, నూరిపెట్టిన మసాలా ముద్దను, యీ పాల పెరుగులో కలిపేసెయ్ – చివర్లో అరసీసా పన్నీరు పోసేసెయ్! 'క్రిర్, క్రిర్,' అని గిన్నెలోంచి శబ్దం వస్తుంది...తరవాత దించేయ్... అదే... బాదం క్రిర్–"

భక్తిగా విన్న తిరుమలాచారి.........

తి.చా : "రక్షించావురా! నీ కడుపు చల్లగా వుండా– దీనికి యింత గ్రంధం వుందని నాకు తెలీదే!"

## 2

పీటలు వేసుంటాయ్! అత్తగారు భోజనానికి కూర్చుని వుంటుంది. —కోడలు విసురుతూ ఉంటుంది. తిరువేంగళం వడ్డిస్తూంటాడు. —అన్నీ అడుగంటినవి వడ్డిస్తూంటాడు. చివరకు పొగలూ సెగలూ కక్కుతున్న గిన్నె తీసుకుని వస్తాడు. ముందుపెట్టి గిన్నె మూత తీస్తాడు. పన్నీరు, మసాలా వుల్లి, ఇంగువ, మొత్తం నానా విధాల పరిమళ వాసనొస్తుంది.

ముక్కులు మూసుకుని

అత్త : "ఛీ! ఛీ! అప్రాచ్యుడా!"

అంటూ చివాల్న లేచింది.

వంటవాడు వణుకుతూ,

తి.చా : చిత్తం! తమరు క్రీరు చేయమన్నారు గదండీ!"

అత్త : క్రీరేమిట్రా!"

తి.చా : అదే! అదే! బాదాంక్రీరు!"

కోడలు నవ్వాపుకుంటుంది.

అత్త : ఇదేం క్రీమురా! మసాలా కంపుకొడుతూ! పాయసంలాగ వుండవలసినదాన్ని యీ గతి పట్టించావేమిట్రా? నీవు చేసావా లేక ఆ మసాలా వెధవ మణి చేసాడా?"

తి.చా : "ఎంతమాట! ఎంతమాట! వాడు చేయలేదు – ఎలా చేయాలో అడిగి తెలుసుకొన్నాను. అంతే!"

అత్త : "ఓరి భ్రష్టా! వాణ్ణడిగి తెలుసుకున్నావా? ఏదీ! ఆ వెధవ...! మణీ! మణీ! ఎక్కడ్రా వెధవ!– బాదంకీరు చెడగొట్టి ఎక్కడో దాక్కున్నాడు– యీ మసాలా గిన్నె తీసి అంట్లలో పడేసి కాస్త అన్నం పెట్టి, మజ్జిగ వెయ్! ఛీ! ఛీ! ప్రొద్దుటే ఎవరి ముఖం చూసానో!"

భోజనానికి కూర్చునేప్పుడు అత్తగారి స్వగతం.

"అయ్యో రాత! బిడ్డ యింత ఆశపడుతూ బాదం కీరు చేయమని అడిగి, తీరా చేసాక రావడం లేదు. ఫ్రెండ్స్‌తో భోంచేస్తా నన్నాడా?

## 3

ఎల్లమ్మ బావిదగ్గర అట్లు తోముతుంటుంది. తోటవాడు సుబ్రమణి బావిలోంచి నీళ్ల తోడి బకెట్ ఎల్లమ్మ ముందుపెడుతూ యీలవేస్తూ...కాసిని నీళ్ళు దానిమీద చల్లుతాడు కొంటెగా—

ఎల్ల : "ఏయ్! నీకేం కళ్ళు నెత్తికెక్కినయ్యా! నేనేం నీ పెళ్ళా న్ననుకున్నావా? సరసం ఆట్టానికి!"

సుబ్ర : "ఎప్పుడో అనుకున్నా – ఏయ్! హీ..."

ఎల్ల : "ఏమన్నావ్–"

సు : "సరసానికి పెళ్ళామే గావాలటే!"

ఎల్ల : "ఆఁ! నీకు ఎంత పొగరు! రోజుకో సినిమా చూస్తూ, నీకు మరీ కొవ్వెక్కువైందిలే!"

సు : "నీముందు సినిమా లెందుకే!"

ఎల్ల : "ఛీ. ఫో!"

సు : "నిన్ను సూస్తా వుంటే తస్సదియ్యా–సినిమాగూడా చూడాలనిపించదే!"

ఎల్ల : "వుంటది – వుంటది – పెద్దమ్మగారితో చెప్పానంటే ఎట్టా వుంటదో, ఆమే చెప్తదిలే!"

దగ్గరకెళ్ళి

సు : "పెద్దమ్మగార్తో చెప్తావా? చెప్పు చూద్దాం!"

ఎల్ల : "ఓ అమ్మగారూ! యీ సుబ్రమణి చూడండి! నామీద నీళ్ళు చల్లుతున్నాడు."

అత్తగారు హాల్లో అరటిపండు తింటూ, కోడలు వచ్చేసరికి తొక్కలు దాచకిందికి తోస్తుంది. దొంగతనంగా తను ఏమీ

తిననట్లు—కేకలు విని "ఏమిటీ! వెనక ఎల్లమ్మ కేకలేస్తోంది!" కోడలు తన దగ్గరికి రాకుండా పురమాయిస్తుంది.

**కోడ :** "ఆ సుబ్రమణికీ దానికీ ఎప్పుడూ ఏదో కీచులాటేగా. వాడేదో కొంటెపని చేసివుంటాడు !"

**అత్త :** "వాడికి రాను రాను పొగరు చాలా ఎక్కువైందే ! వాడిని మార్చి యింకెవర్నన్నా పనిలో పెట్టాలి—"

వెనక కేకలు మరి ఎక్కువగా వినిపిస్తయ్! అత్తగారు లేచి గబ గబ వెనుక వైపుకి పరుగెత్తుతుంది—

కుడివైపునుంచి కోడలు ప్రవేశం.

సుబ్రమణి అలక్ష్యంగా యీల వేసుకుంటూ పని చూసుకొంటుంటాడు. ఎల్లమ్మ నంగనాచిలా అంట్లుతోముతూ ఉంటుంది.

**అత్త :** ఏంటే ! ఏమిటి కేకలేశావ్ !

**ఎల్ల :** కేకలు ఎవరేశా రమ్మగారూ!

అంటూ సుబ్రమణివైపు ఓరగా చూస్తుంది. సుబ్రమణి నవ్వుతాడు.

సుబ్రమణి కొంటెగా నవ్వాలి...యీలతో—

**అత్త :** నవ్వుతావేంరా ! నడమంత్రపు గాడిదా ! సిగ్గు లేకుండా ఏమిట్రా ఆ రౌడీనవ్వూ నువ్వూనూ ! ఆంబోతులా వూరుమీద పడితే వూరుకుంటా రనుకొన్నావా ! ఎముకలు విరగ్గొడతారు, పాపం ! దాని పనేమిటో, అదేమిటో ఒకళ్ళ జోలి దాని కక్కర్లేదు. నీకేం పొయేకాలంరా ! దాని జోలికి పోయావ్ ! నిప్పులాంటి పిల్ల... !

సుబ్రమణి మళ్ళీ నవ్వుతూ, స్టైల్‌గా—

**సు :** అది నిప్పుగాదమ్మగోరూ ! ఒట్టి పప్పు... అదంతా పైకే ! దానికంతా వుందిలెండి యవారం ... ...

అని ఎల్లమ్మను కొంటెగా చూసాడు—ఎల్లమ్మగూడ సుబ్రమణిని ఓరగా ఓ చూపు చూసి, ఏమీ ఎరగనట్లు నటిస్తుంది నేల చూపులు చూస్తూ.

వెనుకనుంచి 'ఎల్లమ్మా !' అనే పొలికేక వినిపించి, అత్తగారు వెనక్కి తిరిగి చూసింది—! పక్కింట్లోనే పని చేస్తున్న ఎల్లమ్మ మొగుడు సింగన్న సింహగర్జనతో వెనక గోడమీది నుంచి దూకుతాడు వాళ్ళున్న చోటికి. చేతిలో కొడవలితో, ఎర్రటి కండ్లతో సుబ్రమణిమీద నిప్పులు గక్కుతూ నిలబడ్డాడు—అత్తగారు గజ గజ వణుకుతూ కోడలి దగ్గరకి గబ గబ వచ్చి.........

**అత్త :** ఒసేవ్ ! వీళ్ళు కొట్టుకు చచ్చేట్లున్నారు - పోలీసుల్దాకా పోకముందే ఆ పోకిరీ వెధవనీ, దాన్నీ పంపించేద్దాం! అంటుపాత్రలు కావాలంటే, నేనూ తిరుమలం తోముతాం !

ఆమె ఖంగారు చూసి నవ్వొచ్చింది కోడలికి.

**సింగన్న :** ఏంటీ ! ఏం చేశాడు వాడు ! నీమీద నీళ్ళు బోశాడా ! చెప్పు ! వాణ్ణి యిప్పుడే నరికి పోగు లేస్తాను -

అంటూ గర్జిస్తాడు సింగన్న.

**అత్త :** ఓయమ్మ ! ఏమిటే యీ పీడా !

సుబ్రమణి నిర్లక్ష్యంగా యీల వేసుకుంటున్నాడు—ఏమీతెలీని నంగనాచిలా !

**ఎల్ల :** ఏంటి మామా ! నీళ్లేంటి ? ఎవరు బోశారూ ?

**అత్త :** హోరి దీని తస్సాదియ్యా !

(అని కోడల్తో)

విన్నావటే దాని మాటలూ !

**సిం :** నిజం చెప్పు ! వాడు నీళ్ళు నీమీద చల్లాడా లేదా !

**ఎల్ల :** అబ్బే ! లేదు మామా ! ఆ యబ్బి నా ఊసుకే రాడు ... కుళాయిలో నీళ్ల రాలేదు – అందుకని బాయినీళ్ళు తెచ్చిచ్చాడు – అంతే ! యింకా ఎప్పుడైనా, యీ వంటాయనే, నా ఒంటిమీద చెయ్యేస్తాడు ... పోతా ... వస్తా ...

అంటూ యాభై యేండ్ల వంటవాడు తిరువేంగళం మీదికి తిప్పుతుంది కథంతా.

**అత్త :** హవురా ! హవురా ! ఏం కైకవే ! ఏం కైకవే!

అని అత్తగారు గుండెలు బాదుకుంటుంది—

**తి.చా :** శ్రీహరీ ! పాపం శమించుగాక !

అంటూ చెవులు మూసుకుంటాడు......

'హే శ్రీనివాసా ! ఏమిటీ అపవాదు - ఏనాడో స్వసుఖాలను మరచి, శరీరసౌఖ్యాలను త్యజించి, వంట చెరుకుల్లో వంటచెరుకువలె బ్రతుకుతున్న నా మీదా యీ అభాండం ... !

అంటూ వాపోతాడు—

గుండుమణి ఎల్లమ్మ భర్తను కావాలనే రెచ్చగొడుతూ,

**గుండు :** చాలాసార్లు ఎల్లమ్మని సినిమాకి పిల్చాడీ అయ్యోరు

అంటాడు సింగన్నతో—

**ఎల్ల :** 'అవును మామా !' అంటుంది సుబ్రమణిని కాపాడేందుకు......

**తి.చా. :** హే శ్రీనివాసా.........

సింగన్న నిప్పులు తొక్కిన కోతిలాగా "ఏం వంటాయనా! ప్రాణాల మీద ఆశ ఎదులుకున్నావా" అంటూ వంటవాడిమీదకి పోతాడు.

**తి.చా :** 'హే శ్రీనివాసా ! కాపాడు ప్రభో !'

అంటూ అత్తగారి వెనకాల దాక్కుంటాడు గడగడ వణుకుతూ.

**ఎల్ల :** యీ వంటాయన మంచోడు మామా !

అంటుంది నంగనాచిలా.

సింగన్న తోక తొక్కిన త్రాచులాగా కొడవలితో దూకబోయేసరికి, సుబ్రమణి, పనివాడూ అవుతారు.



తిరుమలాచారి హడలెత్తిపోయి వంటింట్లోకి పరుగెత్తి తలుపు లేసుకుంటాడు.

సింగన్న కోపంచూసి లోలోపలే గజగజ వణుకుతున్న అత్తగారు కోడలు వెనుక నిలబడి—

అత్త : ఏమిట్రా మరీ ఆగడంగా వుందీ ! నీ పెళ్ళాన్ని నీవు అదుపులో పెట్టుకోవాలే గాని, ఊళ్ళోవాళ్ళమీద పడితే వూరుకుంటా రనుకున్నావా ... ! ఆ! ఏమిటీ రచ్చ...!

సిం : సిగదరగ ! ఎందుకులే వొదిలి పెట్టా–

అంటాడు సుబ్రమణికేసి కోపంగా చూస్తూ—

సు : ఏంచేసేవోడి వేంటి ! గడ్డికోసే కొడవలికి భయ పట్టానికి వంటోణ్ణి గాదు.

సిం : ఏమన్నావ్ ! నాయాల ! గడ్డి కోసేదా ! నీ పీక్కోసేదా!

అంటూ సుబ్రమణి మీదికి దూకుతాడు. ఎల్లమ్మ అమాంతం సింగన్నని వాటేసుకుని

ఎల్ల : ఒద్దు మామా ! ఒద్దు !

అత్తగారు వాళ్ళని బయటికి తరుముతారు.

సుబ్రమణి నవ్వుతాడు—

## 4

అమ్మగారండీ, అమ్మగారండీ అంటూ వస్తాడు గుండుమణి

గుండు : అమ్మగారండీ, కొత్త పనిమనిషిని తీసుకొచ్చానండి.

కోడలు : మరి ఎల్లమ్మేమయింది ?

గుండు : ఎల్లమ్మ యింక రాదండి.

కోడలు : ఏవిట్రా ?

గుం : మరేమోనండి, ఎల్లమ్మా, సుబ్రమణ్యం నిన్నరాత్రి ఎక్కడికో వెళ్ళిపోయారండి.

కో : ఏంరా ? సరి. యీ సంగతి పెద్దమ్మగారికి చెప్పకు.

అత్త : ఏంరా, పనిమనిషంటున్నావేమిటీ ?

కో : ఏంలేదు. కొత్త పనిమనిషొచ్చిందట.

అత్త : కొత్త పనిమని షేమిటే ? ఎల్లమ్మ కేమయిందీ ?

కో : ఎల్లమ్మ, పుట్టింటి కెళ్ళింది. ఎవరికో వొంట్లో బాలో లేదట. మరి యిప్పట్లో రాదట. సరే రమ్మను.

గుం : దాదా.

నర్స : దాదా అంటన్నావు నేనేం గేదె ననుకున్నావా. నవ(సకోరవండి.

కో : ఏ వూరు ?

న : గుంటూరండి.

కో : నిన్ను చూడగానే హైదరాబాదునుంచి వస్తున్నా వనుకున్నాను.

నర్స : మొదట అక్కడే ఉండేదాన్నండి. అక్కడ గిట్టు బాటుకాక గుంటూ రొచ్చేశానండి.

కో : గుంటూర్లో ఏం పని చేసేదానివి.

నర్స : పొగాకు కంపెనీలో నండి.

అత్త : ఏవిటీ పొగాకు కంపెనీలో పనిచేసేదా! ఛి ఛి ఛి మనకొద్దు.

(కోడలు సైగ చేస్తుంది)

నర్స : అబ్బెబ్బె. ఆ కంపెనీ యజమాని యింట్లో పనిచేసే దాన్నండి.

అత్త : అదేమిటే, ఆ పెట్టెమీదంతా ఏవో బొమ్మలున్నాయ్.

కో : ఆడాళ్ళ బొమ్మలు గూడా ఉన్నాయండి. అయ్యన్నీ సినిమా యాక్టర్ల బొమ్మలండి. యంటీ రామారావు......

నర్స : నాగేశ్వ్రరావూ ! సావి(త్రి, జమున...

అత్త : ఆహా ! దీనికి సినిమాపిచ్చిలాగుందే, యిదేం పనిచేస్తుందే...

మళ్ళీ నర్సమ్మకు సైగ చేస్తుంది కోడలు, పిచ్చిగా వాగొద్దని...

నర్స : నాకు సినిమా పిచ్చిగాదండి-నాకు సినిమా వేషా లిప్పిస్తానని తీస్కెళ్ళాడండి ! పొగాకు కంపెనీలో పనిచేసి ఎన్నాళ్లు బతుకుతావే ! అని.

అత్త : వాడెవడేవ్ ?

నర్స : ఆ ఎదవ సచ్చినోడి పేరెత్తితేనే నా కొళ్ళు మంట ...ఎందుకులెండి ఆది పేరు.

కోడ : మావట ! ...

అత్త : ఆహా ! మీ మామా !

మణి : యింతకీ వేషా లిప్పించాడా ?

నర్స : ఆ వేషాలు మండిపోను — నా ఒంటిమీద నగలన్నీ కాజేశాడు.

కోడ : తెలీ కడుగుతా ? నీ ఒంటిమీది నగలు వాడెందుకు కాజేసినట్టూ ?

నర్స : మీ కింకా అర్ధంకాలా.

కోడ : ఊహూ( !

నర్స : సినిమాల్లో జేరాలంటే డాన్సు కావాలని నాకు డాన్సు నేర్పించాడండి.

మణి : యింతకీ నిన్నే సినిమాలో సూశ్నేదే ! ఎందులో ఏశావ్ !

నర్స : ఏదో ఎండలో నిలబెట్టి అటు రమ్మని యిటు పొమ్మని అడ్డమైన ఏషా లేయించాడండీ ! ...

మణి : యింతకీ హీరోయిన్ వేషం వేశావా ?

నర్స : అదే అడిగాను – యియ్యలా. అందుకనే వచ్చేశాను.

కోడ : మంచిపని చేశావ్ ! ఏ ఏ పన్లు చేస్తావ్ ? ... నీ పేరేమిటి ?

నర్స : యిల్లూడుస్తా ! అంట్లు తోముతా ! పెద్దమ్మ కాళ్ళకి ఆముదం పట్టిత్తా ! వీపుకి అమృతాంజనం పట్టిత్తా !

అత్త : యింకా ఏం పట్టిస్తావ్ !

నర్స : ముప్పొద్దులా మూడు కంచాలు.

అత్త : యిదేమిటే ! మూడు కంచాలు పట్టిస్తానంటూంది ! మనందరి కొండింది యిదే తినేట్టుందే !

కోడలు సైగతో నర్సమ్మ

నర్స : అహ ! హ ! ఆ పొగా క్కంపెనీ ఆయ నింటో పట్టిచ్చేదాన్నిలెండి ! సినిమాల్లో నాజూగ్గా వుండాలని ముప్పూటలా కాఫీ టిపెనే పట్టించేదాన్ని.

అత్త : ముప్పూటలా కాఫీ, టిపెనా ?

నర్స : మరి ఏదీ పట్టించకుండా మీ కామదం ఎట్ట పట్టిత్త ననుకున్నవ్ !

అత్త : నీవు పట్టించే ఆముదానికి చద్దెన్నం చాల్లేవే !

నర్స : సరే ! అదే పట్టిత్తాన్లెండి ! సరే ! యిప్పుడేం పని చేయమంటారు ?

కోడ : వెళ్ళు. అంట్లున్నాయి తోమి...... వాకిలి చిమ్మి, ముగ్గేసి, తర్వాత పెద్దమ్మగారు స్నానంచేసి మడి గట్టుకునే లోపుగా ఆమె కాళ్ళకి ఆముదం పట్టించి, వీపుకి కాస్త అమృతాంజనం పట్టించు !

నర్స : అట్టగే ! పెట్టెపట్టా !

అని గుండుమణికి చెప్పి స్టైల్‌గా లోపలి కెళ్తుంది.

నర్సమ్మ నిష్క్రమించింది. మణి ఉలిక్కిపడతాడు. అత్తా కోడలు దాన్నే చూస్తుంటారు.

నర్సమ్మ హాల్లో అత్తగారి వీపుకి ఆముదం ఒకవైపు అమృతాంజనం ఇంకోవైపూ పట్టిస్తూంటుంది.

అత్త : చద్దెన్నం తిన్నావంటే !

నర్స : ముందు మీకు ఆముదం పట్టించే తర్వాత్తింటానండి.

అత్త : నీ పేరేంటే !

నర్స : నరసమ్మండి ! ... కానీ సినిమాల కా పేరు బాగుండదని నర్సశ్రీగా మార్చాడా ఎదవ సచ్చినోడు.

అత్త : ఆ యిశ్రీలన్నీ మా యింట్లో ఒద్దులే. నరసమ్మనే పిలుస్తాం.

నర్స : అట్టాగే పిలవండి ...

పరధ్యానంగా నర్సమ్మ అత్తగారి మోకాలు రెండు మెలికలు తిప్పుతుంది

అత్త : అబ్బాబ్బా ! ... ఒసేవ్ ! ... నెమ్మదే ... నెమ్మదిగా ! ... నా ఎముకలు విరిచేట్టున్నావ్.

వంటవాడు తిరుమలాచారి వస్తాడు.

అత్త : ఎముకలు బయటపడతాయ్...సరిగపట్టు.

వంటవాడు ప్రవేశం

వంట : ఏయ్ ! నర్సమ్మా ! అంట్లు తోమాలి.

నర్స : వచ్చావ్ ! ... యిహఁ ఫో ! ... ఎప్పుడూ బండె డంట్లు బడేత్తావ్ ! ఎదవ సచ్చినోడు – వీడు చేసే వంటకి.

వంట : ఏమిటంటున్నావ్ ! నర్సమ్మా !

అత్త : ఏమిటే వాడిని మరీ పిడకలు కట్టి ఆడిస్తున్నావ్ !

నర్స : అబ్బే ! లేదండీ ! ఎప్పుడు చూసినా అంట్లు అంట్లని అల్లాడతాడు – మీ కాళ్ళు పట్టేటప్పుడే అడుగుతాడేం !

అత్త : అవును ! వాడి కిదొక మాయరోగం – సరే యిక చాలు ! వెళ్ళు !

( పెరటిలో )

నర్స : యిదుగో ! తిరగమాతాచారూ యింద గిన్నెలు !

వంట : నా పేరు తిరుమలాచారి !

నర్స : నాకు నోరు తిరగదు ఫో ! యిదుగో చూడు, తిరగమోతాచారూ ! నాకో అర్ధరూపాయుంచే యియ్యి !

వంట : నా దగ్గ రెక్కడుందీ !

నర్స : నీ దగ్గర్లేదూ ? తిరపతెంకన్న పటం కిందుంది తీసియ్ !

వంట : హే ! శ్రీనివాసా ! ... నువ్వెప్పుడు చూశావ్ ! కొంపతీసి వంటింట్లోకి కూడ జొరపడ్డావా !

నర్స : యిదుగో ! తిరగమోతాచారూ ! నాకు పిచ్చెత్తినట్టుంది ! తొందరగా ! అర్ధరూపాయ్ !

వంట : అదీ...ముడుపు !

నర్స : కడుపుకు తినకుండా ముడుపేంట్రా ఎదవ సచ్చినోడా ! ... నా కిస్తే కాల్చున్నా పారేత్తాను.

వంట : ఎవర్కీ ?

నర్స : యివ్వకపోతే నిన్నే ! తిక్కెక్కుతోంది–తొందరగా యిత్తావా ? లేదా ?

వంట : బాబోయ్ ! యిదుగో యిస్తున్నా ! దుష్టులకు దూరంగా వుండాలి.

బొడ్డోనుంచి డబ్బు తీసి నర్సమ్మ కిస్తాడు.

నర్స : దొంగ సచ్చినోడా ! యిందాక లేదంటివే !

అత్త : నరసమ్మా ! కాస్త కాళ్ళకి ఆముదం పట్టించవే !

నర్సమ్మ కోపం, విసుగుతో

నర్స : ఏందమ్మగోరూ ! (స్వగతంలో) యీమెకి ఆముదం తోమీ తోమీ ఆ ఏదంతా నా కెక్కింది – ఎదవ పీడా. "అబ్బబ్బ ! నావల్ల గాదమ్మగారూ ! ఏందో తిక్క తిక్కగా వుంది – కొట్టు కెళ్ళి మాత్రే దన్నా కొనేసుకొస్తా."

అత్తగారు అదిరిపడి కోడల్తో !

అత్త : ఏమిటే ! అప్పుడే దీని వాలకం మారుతున్నట్లుంది. మరీ ఖయ్యాళి మనిషిలాగుంది.

కోడ : అదే చూస్తున్నా ! వుండండి, నే రాస్తాను ఆముదం.

అని కోడలు ఆముదం అత్తగారికి రాస్తుంది. ఇంతలో మణి పరుగు పరుగున వస్తాడు.

మణి : అమ్మగారమ్మగారూ ! తొందరగా రండీ ! మీకో తమాషా చూపిస్తా !

అప్పటికే అత్తగారు నిద్రపోతున్నందున ఉస్ ! అని నిశ్శబ్దంగా లేచి వెళుతుంది కోడలు ! పెరట్లో నర్సమ్మ చుట్టతాగుతూ.

నాయుడోళ్ళింటికాడ నల్లదుమ్మ చెట్టుకాడ, నాయు డేమన్నాడే ! బుల్లా ! అబ్బ నా గుండె ఝల్లు మన్నదే ! బుల్లా !

పనివాడు మణి దిరువు వేస్తాడు – నర్సమ్మ వెంటనే వెనక్కి తిరిగి చూసి

నర్స : అమ్మగారూ! మీరా ! ఎంత సేపయిందీ, మీరొచ్చి !

కోడలు : అదే!...నాయుడోళ్ళింటికాడ నల్లదుమ్మ చెట్టుకాడ నాయుడు నీతో ఏదో అంటున్నాడే ! అప్పుడొచ్చా.

నర్స : పోండమ్మగారూ.

కోడ : యిదుగో నరసమ్మా ! ... నేనంతా చూశాను. నీ కెంత కాలంనుంచి ఈ అలవాటు !

నర్స : సూడండమ్మగారూ ! ... నేను దొంగతనం చేస్తా ... కాని అబద్ధం మాత్రం ఆడను ... ఇది గుంటూరులో అలవాటయిందండి.

కోడ : సరేగానీ యిది పెద్దమ్మగారికి తెలీగూడదు ... ఆమె చూస్తే నీ పని గోవిందా ... నీ క్కావాలన్నప్పుడు చిల్లర డబ్బులు నన్నడుగు. పెద్దమ్మగారు వేసిన ముడుపు, ముల్లె దొంగతనం చేయక ... తెలిసిందా ! యింకోసారి యిలా చేస్తే....

నర్స : అబ్బెబ్బె ! మా తల్లి బంగారం, ఎంత మంచోళ్ళమ్మా మీరు !

కోడి : సరే పొగ డ్త లొద్దుగానీ పని సరిగా చేయి చాలు. వెంటనే వెళ్ళి పెద్దమ్మకి ఆముదం పట్టించు ... వెళ్ళు.

నర్స : ఓ ! యిదుగో సిటికెలో ఎళ్ళి పట్టిత్తా.

కోడ : యిదుగో చూడూ ! నోరు శుభ్రంచేసుకుని వెళ్ళు, నీళ్ళు పుక్కిలించి.

నర్స : యిదుగో పుక్కిలిచ్చే ఎళ్తా !

నరసమ్మ కూనిరాగాలు తీస్తూ హుషారుగా, అమాంతంగా వచ్చి అరుగుమీద పడుకున్న అత్తగారి కాళ్లు బర్రున కిందికి లాగుతుంది.

అత్త : ఓ యమ్మ ! ఏమిటే యిదీ !...

అంటూ అత్తగారు అదరిపడతారు...నర్సమ్మ పకపక నవ్వుతూ-

నర్స : నేనేనండి పెద్దమ్మగోరూ ! కాళ్ళియ్యండి ఆముదం పట్టిత్తా.

అత్త : నా కాళ్ళు రుద్ది రుద్దిన వేడంతా నీ కెక్కిందంటివి గదే !

నర్స : యిక ఎక్కదులెండి ! ... అదంతా ఊదిపారేశా.

అప్పుడే అక్కడికి వచ్చిన కోడలు సైగచేస్తుంది నర్సమ్మకు.

అత్త : ఊదడ మేమిటే !

నర్స : (తడబడుతూ) అదేనండమ్మగారూ ఆ ఏడంతా అరిచేతుల్లో వూదేత్తున్నా ... అంతే ...

అంటూ అరిచేతులు వూదుకొంటుంది.

నరసమ్మ అత్తగారి కాళ్ళకి ఆముదం పట్టిస్తూంటుంగ-

గుండుమణి బయట్నుంచి పరుగెత్తుకొచ్చి...

గుండు : నర్సమ్మా ! మీ మాఁ వొచ్చాడు.

నర్స : ఎవ్రరా మావా, దోమా ?

గుండు : అప్పుడు చెప్పేవుగదా. సినిమాలో చేర్పించాడు అని.

నర్స : ఓ ఆడా, ఆ సచ్చినోడు ఇక్కడి కెందుకొచ్చాడు, ఎందుకు రానిచ్చేవు ?

మామ : ఏఁవే, నర్సశ్రీ నన్ను రానియ్య నంటావటే.

నర్స : మాయదారి సచ్చినోడా, నన్ను నట్టేట్లో ముంచి పారిపోయావు గదా ! మళ్ళీ ఏ ముఖం పెట్టు కొచ్చావ్రా !

మామ : అది గాదే.

నర్స : ఏది గాదురా, నన్ను మోసంచేసి నా నగలన్నీ తగలేశావు గదరా. నా బతుకు మంగళగిరి తిరనాల్లా చేశేవు గదరా. ఇంకా ఏం వుందని వొచ్చావురా. ఇదిగో ఆవదం సీసా మిగిలింది. అంటుకో.

మామ : అబ్బబ్బా. చెప్పేది వినిపించుకోకుండా ఏవిఁటే నీ గొడవ. నీకు సినిమాలో మంచి ఛాన్సొచ్చిందే.

నర్స : నీ మాయదారి మాటలు నమ్మను పోరా.

మామ : భానుమతిగారు అంతా మన మంచికే సినిమా తీస్తున్నారు. అందులో పొగాకు కంపెనీలో పనిచేసే వేషానికి నీకోసం కబురెట్టారు. నిన్ను వెతుక్కుంటూ ఇక్కడి కొచ్చానే.

న : ఆ. భానుమతిగారు సినిమా తీస్తున్నారా?

(కాళ్లు క్రిందపడేసి)

సచ్చిన గేదె దూడంత బరువు. ఏరా మామా. ఏం సినిమా తీస్తున్నా్రా.

మా : అంతా మన మంచికే.

న : ఇదంతా నా మంచికే.

మా : కాదే అంతా 'మన' మంచికే.

న : షూటిం గెప్పుడంట.

మా : మొదలెట్టి నాలుగు రీళ్ళు పిక్చర్ కూడా తీసేశారే.

న : అమ్మో. మొదలెట్టేశారా.

(పెట్టె తీసుకొచ్చి)

పెద్దమ్మగారూ ఎళ్లొత్తానండి. చిన్నమ్మగారూ ఎళ్లొత్తానండి. తిరగ మోతచారూ, గుండుమణీ ఎళ్లొత్తానా్రి. మావా పెట్టె పట్రా.

నిష్క్రమణ

మా : (పెట్టె తీసుకుని) ఈ కూజా బతుకు యీ జన్మకి తప్పదనుకుంటాను.

నిష్క్రమణ

అత్త : హాసి దీని తస్సాదియ్యా ! సినిమా వాసన దాన్ని వదల్లేదే, కుడితిలో బడ్డ ఎలకల్లా ఆ సినిమాల్లో కెళ్ళినవాళ్ళు అందులోనే మునుగుతూ తేల్తూంటారట గాని బయటపడ్డానికి యిష్టపడరని విన్నాను. నిజమే నంటే.

కోడలు : నిజమేనట. అందుకు నరసమ్మే నిదర్శనము.